సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 24 । జూలై । 2024



పేద విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలు వరం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలు వరంగా మారాయని ఆర్జీయూకేటీ వీసీ విజయకుమార్ పేర్కొన్నారు. -IIలో



వసూళ్లు తడబడి.. తగ్గిన రాబడి

జిల్లా వ్యాప్తంగా మార్కెట్ కమిటీల సెస్సు వసూళ్లతో జోరు తగ్గింది. గతేడాది కంటే ఈ ఏడాది వసూళ్లు తగ్గిపోయాయి. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.2/27.6

జిల్లాలో మంగళవారం 27.6 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పాఠశాలల సందర్శన



విద్యార్థుల అభ్యసనాన్ని పరిశీలిస్తున్న భవిత కేంద్రాల రాష్ట్ర పరిశీలకులు కల్పన శైల

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండలంలోని దివ్యాంగుల పాఠశాల (భవిత)ను రాష్ట్ర పరిశీలకులు కల్పన శైల మంగళవారం పరిశీలించారు. దీంతోపాటు టీచ్ ఎట్ రైట్ లెవెల్ (తరల్) పనితీరు అమలు ఎలా జరుగుతుందో ఆజాద్ నగర్, వెంకట గారి పల్లి పాఠశాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి పనితీరు మెరుగుపరచుకోవాలని అక్కడి రిసోర్స్ పర్సన్‌లకు చురకలంటించారు. జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త మిట్టా కేశవరెడ్డి, సహాయ సమన్వయకర్త రమణమూర్తి, ఎంఈఓ రమాదేవి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



ప్రభుత్వ బాలుర గృహంలో పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్ : విద్యార్థులంతా.. క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబాఫకృద్దీన్ అన్నారు. కడప ప్రభుత్వ బాలుర గృహంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ బాలుర గృహంలో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు, జువైనల్ తల్లిదండ్రులకు, జూనియర్ జస్టిస్ మెంబర్స్‌కు సూచనలు చేశారు. జైళ్లలో బాలనేరస్తులను గుర్తించి వారికి తగిన న్యాయసహాయం అందించడమే పాన్ ఇండియా ప్రచారం 2024 ముఖ్య ఉద్దేశమన్నారు. పలువురు జడ్జిలు పాల్గొన్నారు.

నిర్మలం.. నిష్ఫలం

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగింది శూన్యం

- కడప ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తని వైనం
- బడ్జెట్‌పై పెదవి విరుస్తున్న రాజకీయ, ఆర్థికరంగ నిపుణులు
- కొప్పర్తి పారిశ్రామికవాడకు మౌళిక వసతులు ఏర్పాటు





సాక్షి ప్రతినిధి, కడప: కడప ఉక్కుపై ఊసే లేకుండా పోయింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల ప్రస్తావనే కరువైంది. మంగళవారం లోక్‌సభలో ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ జిల్లా వాసుల్నీ పూర్తిగా నిరాశ పర్చింది. రైతులకు, శ్రామికులు, బడుగు, బలహీన వర్గాలతోపాటు వేతన జీవులు సైతం పెదవి విరుస్తున్నారు.

ఉక్కు పరిశ్రమను మరచిపోయారా!

ఏపీ విభజన బిల్లులో పొందుపరిచిన హక్కుల గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావనే లేకుండా చేశారు. ముఖ్యంగా కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై కేంద్ర బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. అసలే విభజన హామీలను నెరవేర్చడంలో తాత్సారం చేస్తున్నారు. చివరికి బడ్జెట్‌లోనూ ప్రస్తావనే లేకపోవడం గమనార్హం. అన్ని వనరులు ఉన్న కడపలో ఉక్కు పరిశ్రమను నెలకొల్పాల్సిన ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీతో వెనుకబడిన రాయలసీమ జిల్లాల ఉన్నతికి కృషి చేస్తారని భావించినా నిరాశ ఎదురయ్యిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వెనుకబడిన ప్రాంతాల ఉన్నతికి కేంద్ర ప్రభుత్వంలో చిత్తశుద్ధి లోపించిందని పలువురు ఆరోపిస్తున్నారు.

వేతన జీవులకు నిరాశే ..

వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ నిరాశే మిగిల్చింది. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి రూ. 2.50 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉండగా, దాన్ని ఐదు లక్షల వరకు పెంచుతారని ఉద్యోగులు ఆశించారు. కేవలం రూ.3లక్షల మాత్రమే పరిమితం చేయడంపై ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు.10ఏళ్ల సర్వీసు ఉన్న ఉద్యోగులకు బడ్జెట్‌తో వాతలు పెట్టారని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

కొప్పర్తి పారిశ్రామికవాడకు ఊరట....

హైదరాబాద్-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా కొప్పర్తి పారిశ్రామికవాడకు నీరు, విద్యుత్, రోడ్లు, హైవే కనెక్టవిటీ వసతులు సమకూర్చనున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో పొందుపర్చారు. అదో ఊరటగా పలువురు భావిస్తున్నారు.

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం...

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సహానికి కేంద్ర ప్రభుత్వం మద్దతుగా నిలిచింది. ఆ పరిశ్రమ ప్రోత్సాహానికి అవసరమైన ప్రణాళికలు మేరకు ఆర్థిక తోడ్పాటు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

టీడీపీ విఫలం



రాష్ట్రానికి నిధులు రప్పించడంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పూర్తిగా విఫలమయ్యారు. ప్రత్యేక సాయం పేరిట కేంద్రం ఆంధ్రప్రదేశ్ కు మోసం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏపీ రాజధాని కోసం రూ.15 వేల కోట్లు నామ మాత్రపు సాయ ప్రకటన. –కోటపాటి లక్ష్మయ్య యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టీఐ చైర్మన్

ఉద్యోగులకు ఊరట ఇవ్వని కేంద్ర బడ్జెట్



ఉద్యోగులు ఆశించిన విధంగా పన్ను నిబంధనలను కేంద్ర బడ్జెట్లో మార్చకపోవడం శోచనీయం. జీవన వ్యయాన్ని, ధరల సూచిక ,ద్రవ్యోల్బణం అంశాలను దృష్టిలో పెట్టుకొని ఆదాయం పన్ను స్లాబులు మార్చకపోవడం అన్యాయం. స్టాండర్డ్ డిటెక్షన్ 75 వేలకు పెంచడం మాత్రమే ఉద్యోగులకు కాస్త ఊరట. – సివి ప్రసాద్ ,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఏపీటీఎఫ్ అమరావతి

'హోదా'కు మంగళం పాడారు



విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సి ఉండగా, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ అంశాన్ని విస్మరించారు. కడప ఉక్కు పరిశ్రమ ఊసే లేకుండా పోయింది. స్వామినాథన్ సిఫారసుల మేరకు రైతులకు మేలు చేకూర్చలేదు. విశాఖ రైల్వేజోన్‌ను పరిగణలోకి తీసుకోలేదు. అమరావతి పేరుతో దోపిడీ చేయడానికి మరో అవకాశం ఏర్పడింది. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఏపీకి ఒరిగేదేమీ లేదు. – కె. సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు.

మాటలు ఘనం..నిధులు స్వల్పం



బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు మాటలు ఘనం, నిధులు స్వల్పం అన్న చందంగా ఉంది. రాష్ట్ర విభజన హామీల్లో భాగమైన కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పై ఊసే లేకపోవడం విచారకరం. కడప బెంగుళూరు రైల్వే లైన్ పూర్తికి నిధుల ప్రస్తావన లేదు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. –చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

వైభవంగా పుష్పయాగం



పుష్పయాగంలో భాగంగా విశేష పూజలు అందుకుంటున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో సాయికృష్ణ శర్మ, సుమంత్ శర్మ, పార్థస్వామి విశేష పూజలు నిర్వహించారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయాన్ని శోభాయమానంగా, పచ్చని తోరణాలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు. డిప్యూటీ ఈఓ నటేష్ బాబు పాల్గొన్నారు. -నందలూరు

వేడుకగా రథోత్సవం



రథోత్సవంలో భక్తులు

తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం సిద్దేశ్వరస్వామి, చెన్నకేశవస్వామికి రథోత్సవం వేడుకగా కొనసాగింది. శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఎంతో శోభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగుతూ తాళ్లపాక మాఢవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. గోవిందనామస్మరణాలు, భజన బృందాలు, కోలాటాల నడుమ ఆద్యంతం కనుల పండువగా సాగింది. -రాజంపేట

చేపల వేటకు 25న బహిరంగ వేలం


కడప అగ్రికల్చర్: బి.మఠం మండల పరిధిలోని బి.మఠం చెరువులో 2025 జూన్ 30వ తేదీ వరకు చేపలు పట్టుకుని అమ్ముకునేందుకు ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటలకు బి.మఠం కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉండి వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ జిరాక్స్‌తోపాటు రూ. 500లు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించి రూ. 3301 నుంచి వేలంపాట మొదలవుతుందని తెలిపారు.



చంద్రన్నా.. భరోసా ఏదన్నా!

బాబు గారడీకి కాడి ఓడి పోయింది.. చంద్రన్న మాయ మాటలకు నాగలి చిన్నబోయింది.. 'అన్నదాత సుఖీభవ' హామీ నీటి మూటే అయ్యింది. అన్నదాతను సీఎం చంద్రబాబు మరోసారి మోసం చేశారు. ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా.. అందలమెక్కాక హామీలను అటకెక్కిస్తున్నారు. 'అన్నదాతకు ఏటా సాయం చేస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. ఫలితంగా సాయమందక.. సేద్యం సాగక రైతన్న నేల చూపులు చూస్తూ బేలగా నిలబడిపోయాడు.





- రైతులకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- అన్నదాత సుఖీభవ పథకం అమలయ్యేదెప్పుడు?
- సాగుకు పెట్టుబడి నిధులందక అన్నదాతల ఇక్కట్లు
- గత ప్రభుత్వ హయాంలో రైతులకు రూ.1191.30 కోట్లు లబ్ధి
- జిల్లాలో ఈ ఏడాది 79,115 హెక్టార్లలో సాగుకానున్న పంటలు

కడప అగ్రికల్చర్: జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రైతులు కాడి కట్టి సాగులో మునిగిపోయారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 50 రోజులు గడిచింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 79,115 హెక్టార్లలో వరి, పత్తి, మినుము, వేరుశనగ, శనగలతోపాటు పలు రకాల పంటలు సాగుకానున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 10 వేల హెక్టార్లలో వివిధ పంటలు కూడా సాగయ్యాయి. అండగా నిలబడాల్సిన ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. సాయం చేయక చోద్యం చూస్తోంది. రైతుల పంటలసాగుకు అవసరమైన అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ. 20 వేలు మాత్రం మంజూరు చేయలేదు. ఫలితంగా అన్నదాతలు అప్పులు చేసి మరీ పంటలను సాగు చేసుకునే పరిస్థితి నెలకొంది. అంతోఇంతో కేంద్ర ప్రభుత్వమే సాయం చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలివిడత సాయంగా గత నెల 18న ప్రతి రైతుకు రూ. 2 వేల చొప్పున రైతు ఖాతాలకు నగదు జమచేసింది. దీంతో వైఎస్సార్‌జిల్లాలో 1,85,607 మంది రైతులకు రూ. 37.36 కోట్లు రైతు ఖాతాలకు జమ అయ్యాయి. ఈ మొత్తంతో తమ పంటల సాగకు ముందుగా అవసరమైన విత్తనాల కొనుగోలుకు కాసింత సహాయ పడిందని పలువురు రైతులు తెలిపారు.

గత ప్రభుత్వం ఆరంభంలోనే పెట్టుబడి సాయం...

రైతులు పంటలసాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం అందించి అన్నదాతలకు అండగా నిలిచింది. పీఎం కిసాన్ సాయం కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7500 మొత్తం కలిపి ఏడాదికి రూ. 13,500లు ఏటా క్రమం తప్పకుండా రైతు ఖాతాలకు జమ చేసేది. వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసా కింద ఐదేళ్లపాటు రూ. 1191.03 కోట్లను అన్నదాతలకు అందించి అండగా నిలిచింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రాష్ట్రవాటా కింద రూ.14 వేలు అందిస్తామని ప్రకటించింది. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా 2,10,481 మంది రైతులకు ఏడాదికి అదనంగా 136.81 కోట్లు అందాల్సి ఉంది. కానీ ఇంత వరకూ ఊసే లేకుండా రైతులతో ఆడుకుంటోంది.

కౌలు రైతులకు సైతం..

ఎటువంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు అటవీ, దేవదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందిస్తుందో లేదో కూడా స్పష్టత ఇవ్వలేదు.

రాష్ట్రసాయం కోసం రైతుల ఎదురుచూపు...

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండంతో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. ఈ దశలో రైతులు దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో బయట వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చుకుని పంటలను సాగు చేసుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కూటమి ప్రభుత్వం స్పందిస్తుందో లేదో వేచి చూడాలి.

మాట మార్చడం బాబుకు అలవాటే..

తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాది రూ. 20 వేలు ఇస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫేస్టోలో ప్రకటించింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకుని 50 రోజులు దాటింది. ఇంత వరకు అన్నదాత సుఖీభవ ప్రస్తావనే లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో అన్నదాత సుఖీభవ విడుదలపై నిర్ణయాన్ని తీసుకుని రైతులకు సాయం అందించాలని అన్నదాతలు ఆశగా అడుగుతున్నారు.

రైతన్నలంటే బాబుకు చిన్నచూపు



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యవసాయమన్నా.., రైతన్నలన్నా చిన్న చూపు. 2014లో అధికారంలోకి వస్తే సంపూర్ణ రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత సవాలక్ష షరతులు విధించి అరకొరగా మాఫీ చేశారు. ఫలితంగా బ్యాంకులలో రూ. 50 వేల రుపాయలు పైబడి రుణాల ఉన్న వారు చంద్రబాబు విధానాల పట్ల డిపాల్టర్లుగా మారి వేలకువేల రూపాయల వడ్డీ చెల్లించి తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు కూడా ఆదే విధంగా వ్యవహరిస్తున్నట్లుగా ఉంది. పైగా రోజుకో శ్వేతపత్రం పేరుతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఏ మాత్రం సమంజసం కాదు. – పి.భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ అనుబంధ, రైతు విభాగం

నిధులను జమ చేయాలి



గత ప్రభుత్వం ఏటా జూన్ మాసంలోనే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇంకా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయక పోవడంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి. -సంబటూరు ప్రసాద్, కమలాపురం.

అప్పులు చేయాల్సి వస్తోంది..



ప్రభుత్వం రైతు భరోసా పథకానికి పేరు మార్చింది తప్పా.. సాయం అందించడంలో ఆలస్యం చేస్తోంది. దీని వల్ల రైతులు పంటల సాగు కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని తొందరగా జమ చేయాలి. – టి.నరసింహారెడ్డి, అధ్యక్షుడు, రైతు ఉత్పత్తిదారుల సంఘం, వనిపెంట, మైదుకూరు మండలం

సాగుకు ఎన్ని తిప్పలో




ఖరీఫ్‌లో పంటల సాగుకు అప్పులు చేస్తున్నాం. సీజన్ ప్రారంభమైనా రైతు భరోసా రైతులకు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. పంటల సాగుకు చేతిలో డబ్బులు లేక అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇచ్చిన హామీలను అమలు చేయాలి. – చలపతి, రైతు, వేముల

గత ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద విడుదలైన నిధుల వివరాలు ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (కోట్లలో)
2019–20	206708	279.93
2020–21	208747	280.06
2021–22	199344	269.11
2022–23	202598	235.68
2023–24	210481	126.25

ఉత్తుత్తి మాటలతో మభ్యపెట్టారు



కూటమి ప్రభుత్వం రైతులకు ఉత్తుత్తి మాటలు చెప్పి మభ్య పెట్టింది. రైతు భరోసాను పేరు అన్నదాత సుఖీభవగా మార్చింది. అన్నదాతలను ఆదుకునే ప్రయత్నం మాత్రం చేయలేదు. కేంద్రం తన వాట రైతుల ఖాతాలలో జమ చేసి సుమారు నెల రోజులు దాటినా.. రాష్ట్ర వాటాను రైతులకు ఇంతవరకు జమ చేయలేదు. ఇది రైతులను మోసం చేసే ప్రభుత్వంగా ఉంది. –హరిప్రసాద్‌రెడ్డి, యర్రగుంట్ల మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, యర్రగుంట్ల

గత ప్రభుత్వంలో..



వైసీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమయ్యేది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రైతులపై మీనమేషాలు లెక్కిస్తోంది. ఇటీవల జరిగిన కేబినేట్ మీటింగ్‌లో కూడా అన్నదాత సుఖీభవ పథకానికి ఏమాత్రం విధి విధానాలను ప్రకటించపోవడం చాలా బాధాకరం. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు రైతు ఖాతాలకు జమచేయాలి. –దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి. సీపీఎం అనుబంధ, రైతు విభాగం

వసూళ్లకు తడబడి.. తగ్గిన రాబడి

జిల్లా వ్యాప్తంగా మార్కెట్ కమిటీల సెస్సు వసూళ్లతో జోరు తగ్గింది. గతేడాది కంటే ఈ ఏడాది వసూళ్లు తగ్గిపోయాయి. జిల్లాలో ఎనిమిది ఏఎంసీల వసూళ్ల పరిస్థితి 30 శాతానికి మించలేదు. మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని అధిగమిస్తామని అధికారులు చెబుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

- 2024–25 ఏడాది లక్ష్యం రూ.12.50 కోట్లు
- ఈ ఏడాది మూడు నెలలకు రూ.2.30 కోట్ల వసూళ్లు
- గతేడాది మూడు నెలలకు రూ. 3.61 కోట్లు వసూళ్లు
- వసూళ్లలో సిద్దవటం, సింహాద్రిపురం ఏఎంసీల వెనుకంజ


వైఎస్సార్ కడప జిల్లా మార్కెట్ యార్డు

కడప అగ్రికల్చర్ : వైఎస్సార్ కడప జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, కమలాపురం, ఎల్ఆర్‌పల్లె, సిద్దవటం, ఎర్రగుంట్లలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలున్నాయి. వీటి పరిధిలో 21 చెక్ పోస్టులున్నాయి. 2024–25 ఏడాదికి పది మార్కెట్ల నుంచి సెస్సు వసూళ్ల లక్ష్యం రూ.12.50 కోట్లు. గత ఏడాది 2023–24లో రూ.11.61 కోట్ల లక్ష్యం నిర్దేశించగా, జూన్ చివరినాటికి రూ.3.61 కోట్ల సెస్సు వసూలైంది. ఈ ఏడాది జూన్ చివరి నాటికి రూ.2.30 కోట్లు మాత్రమే వసూలైంది. గతేడాది కంటే రూ.131.33 లక్షలు తక్కువ. లక్ష్యం పెరిగినా... వసూళ్లు ఈ ఏడాది తగ్గాయి. జిల్లాలో పది మార్కెట్ కమిటీల్లోనూ తక్కువగానే వసూళ్లయ్యాయి. కడప మార్కెట్ కమిటీలో పసుపు, వేరుశనగ, మిగిలిన మార్కెట్ కమిటీల్లో పండ్లు, ఇతర ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగడంతో చెస్ వసూలుకు అవకాశం ఉందని, త్వరలోనే లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.

లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు



జిల్లాలో 2024–25 ఏడాదికి పది మార్కెట్ కమిటీల పరిధిలో 21 చెక్‌పోస్టులు ఉన్నాయి. వాటి వార్షికాదాయం ఏడాదికి రూ.12.50 కోట్ల వసూలు లక్ష్యం. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలకు కలిపి రూ.2.30 కోట్లు వసూలు చేశాం. వసూలు కొంత నిరాశాజనకంగా ఉంది. ఆగష్టు నెల నుంచి సీజన్ ప్రారంభం అవడంతో వసూళ్లు బాగా పెరుగుతాయి, ఏది ఏమైనా మార్చి చివరి నాటికి లక్ష్యాన్ని అధిగమిచేందుకు చర్యలు తీసుకుంటాం.
– ఆజాద్‌వలి, మార్కెటింగ్ శాఖ ఇన్‌చార్జి ఏడీ

జిల్లా వ్యాప్తంగా వసూలైన సెస్సు వివరాలిలా ఉన్నాయి

మార్కెట్ కమిటి	ఈ ఏడాది లక్ష్యం (లక్షల్లో)	గతేడాది వసూలు (లక్షల్లో)	ఈ ఏడాది వసూలు (లక్షల్లో)
కడప	రూ. 185.00	రూ.44.02	రూ. 39.00
సింహాద్రిపురం	రూ. 20.00	రూ.6.01	రూ. 2.97
పొద్దుటూరు	రూ. 182.00	రూ.42.52	రూ. 26.65
బద్వేల్	రూ. 180.00	రూ.57.54	రూ. 56.28
జమ్మలమడుగు	రూ. 120.00	రూ.25.53	రూ. 7.84
పులివెందుల	రూ. 102.00	రూ.27.36	రూ. 21.04
మైదుకూరు	రూ. 270.00	రూ.101.33	రూ. 53.14
కమలాపురం	రూ. 90.00	రూ.31.88	రూ. 10.89
సిద్దవటం	రూ. 20.00	రూ.7.07	రూ. 2.97
ఎర్రగుంట్ల	రూ.75.00	రూ.18.37	రూ. 7.80


కడప మార్కెట్ యార్డులో పసుపు విక్రయాలు

క్లుప్తంగా

నాలుగు ట్రాక్టర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

వేంపల్లె : మండల పరిధిలోని పాపాఘ్ని నది నుంచి అక్రమ ఇసుక నింపిన నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి ఎస్ఈబీ అధికారులకు అప్పగించినట్లు వేంపల్లె సీఐ చాంద్‌బాషా తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఇసుక నింపి తీసుకెళ్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు. పది రోజుల కిందట ఇసుక ట్రాక్టర్ల యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చామని, అయినా అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చోరీ నిందితుల అరెస్టు

కొండాపురం : సెంట్రింగ్ రేకులు చోరీ చేసిన ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు..మండలంలోని కడప–తాడిపత్రి నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు వినియోగించేందుకు సెంట్రింగ్ రేకులను పెంజి అనంతపురం గ్రామ సమీపంలో ఉంచారు. కొందరు దుండగులు వాటిని చోరీ చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసులో ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు.

పొలం దస్త్రాలు తారుమారు

– ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

కడప అర్బన్ : మా పొలం దస్త్రాలు తారుమారు చేసి.. ఇతరుల పేరిట రాయించారని బాధితుడు నరసింహారావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మంగళవారం ఎస్పీ బి.హర్షవర్ధన్‌రాజుకు ఆయన ఫిర్యాదు చేశారు. బి.కోడూరు మండలం పెదుళ్లపల్లి గ్రామ పొలంలో తాను, తన భార్య పేరిట ఉన్న పొలాల రికార్డులను మాయం చేసి అన్యాయం చేశారని కె.నరసింహారావు ఆరోపించారు. స్థానికుడు గంగిరెడ్డి రామమోహన్‌రెడ్డి, అతని భార్య చిన్నమ్మ గంగిరెడ్డి లక్ష్మిదేవి పేరిట రాయించారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లోనూ, హైకోర్టులో ఇంజెక్షన్ ఆర్డర్, ఈ– పాస్ బుక్‌లో తమ పేర్లున్నా దగా చేశారన్నారు. ఇదేమి అన్యాయం అని అడిగితే.. దౌర్జన్యంగా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెదుళ్లపల్లి రెవెన్యూ పొలంలో తన తండ్రి యాసాని వెంకటసుబ్బయ్య పేరిట ఇచ్చిన డీకెటీ పట్టాను సుబ్బారెడ్డి పేరిట మార్చి ఇచ్చారని యాసాని చిన్నవెంకటసుబ్బయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ కార్యాలయంలోని వారే అక్రమాలకు పాల్పడుతున్నారని, తనకు న్యాయం చేయాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

రాయచోటి టౌన్ : బంగారు నగల చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ ఇన్‌చార్జి సీఐ చంద్రశేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఈ నెల 6న రాయచోటి పట్టణంలోని కొత్తపేట హనుమాన్ జంక్షన్ వీధికి చెందిన భాగ్యలక్ష్మి కాలినడకన వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు దొంగలు స్కూటర్‌పై వచ్చి మెడలో బొట్టు చైన్ లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ నెల 2న అనుమానితులుగా భావించి తమిళనాడు రాష్ట్రం హీరన్ చైన్ స్నాచింగ్ గ్యాంగ్‌కు చెందిన యానస్ హుస్సేన్ రాయత్ అలీ, నిలకొట్టికి చెందిన హంస యానస్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారు ప్రస్తుతం కలికిరి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. వారి నుంచి 34 గ్రాముల బంగారు చైను, బజాజ్ స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు.

ఆ బాలుడు మృత్యుంజయుడు

– రైలు నుంచి కింద పడి క్షేమంగా తల్లి వద్దకు


స్వల్పగాయాలతో బయటపడ్డ బాలుడు హుసేన్

వల్లూరు/కమలాపురం : కడప నుంచి నంద్యాలకు వెళ్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి మూడేళ్ల బాలుడు రైల్వే అధికారుల సహకారంతో మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. రైల్వే అధికారులు, ప్రయాణికుల వివరాల మేరకు.. హైదరాబాద్ సమీపంలోని నాంపల్లెకు చెందిన ముంతాజ్ బేగం యాచక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తోంది. మంగళవారం తన మూడేళ్ల కుమారుడు హుసేన్‌తో కలిసి కడప– నంద్యాల డెమో రైలు ఎక్కింది. రైలులో ఆడుకుంటున్న బాలుడు గంగాయపల్లె–కమలాపురం స్టేషన్ మధ్య తొప్పెట్ల సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిపోయాడు. ఇది గమనించిన ప్రయాణికులు కమలాపురం రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం తెలిపారు. వారు వెనువెంటనే స్పందించి గంగాయపల్లె రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. అక్కడి సిబ్బంది అదే సమయంలో వెళ్తున్న గూడ్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు రైలును ఆపి బాలుడిని తీసుకుని కమలాపురం రైల్వే స్టేషన్‌లో తల్లికి క్షేమంగా అప్పగించారు. స్వల్పంగా గాయపడిన బాలుడిని రైల్వే అధికారులు చికిత్స కోసం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పర్యావరణ హిత విగ్రహాలతో ఉత్సవాలు

కలెక్టర్ శివశంకర్ లోతేటి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని, వినాయక చవితి, విజయదశమి ఉత్సవాలకు మట్టి విగ్రహాలే వినియోగించి నిమజ్జనం చేసేలా అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. వినాయక చవితి, విజయదశమి ఉత్సవాల నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ, పారిశుద్ధ్యంపై మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్‌లో జరిగే వినాయకచవితి, అక్టోబర్‌లో జరిగే విజయదశమి ఉత్సవాల నిర్వహణకు మట్టితో చేసిన ఉత్సవ విగ్రహాలను వినియోగించేలా చూడాలన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు.. ముందస్తుగా విగ్రహ తయారీదారులకు హెచ్చరిక జారీ చేస్తూ.. పీవోపీ స్థానంలో పర్యావరణ సహిత మట్టిబొమ్మలు తయారుచేయాలని సూచించాలన్నారు. పాఠశాలలు, జనావాస ప్రాంతాల్లో పోస్టర్లు, కరపత్రాల రూపంలోనూ, మీడియా ద్వారా మట్టి విగ్రహాల వినియోగంపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ధిక్కార చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సమన్వయంతో పనిచేసి.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్క అధికారి భాగస్వామ్యం కావాలన్నారు.అనంతరం మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వారు ప్రచురించిన గోడ పత్రాలు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సుధాకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ డా.పి.శ్రీనివాసులు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, నాలుగు డివిజన్ల ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కలెక్టర్ శివ శంకర్ లోతేటి


రక్తదానం చేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప అర్బన్ : రక్తదానం మహత్తర పుణ్యకార్యం అని, రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. రక్తదానం వారోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లోని బ్లడ్ బ్యాంక్‌లో కలెక్టర్ శివ శంకర్ లోతేటి రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత ఆయనే స్వచ్ఛందంగా రక్తదానం చేసి అందరిలో స్ఫూర్తి నింపారు. అనంతరం బ్లడ్ బ్యాంక్‌లో రక్తసేకరణ ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయాల్లో ఒక్కో రక్తపు బొట్టు కూడా వెలకట్టలేనంత విలువైనదన్నారు. ఈ సందర్భంగా 36 సార్లు రక్తదానం చేసిన పెథాలజీ వైద్య ఉద్యోగి కె. విజయ్‌కుమార్‌కు కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు, అధికారులు రాకేష్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, ఏ. సురేఖ, వై. శ్రీనివాసులు, డిడి సరస్వతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా వ్యాప్తంగా ఆసుపత్రులలో సౌకర్యాలు పెంచాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ అంశాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 176 పారామెడికల్ సిబ్బంది,భర్తీ విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక ప్రాతిపదికన నిపుణులను నియమించాలన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విషయంలో తన వంతు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. నిధుల లేమితో జిల్లాలోని పంచాయతీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి.. సహకరిస్తానని హామీ ఇచ్చారు. కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, చంద్రఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి జలాశయంలో దూకేందుకు యత్నం

– గమనించి పోలీసులకు అప్పగించిన జలాశయం సిబ్బంది


పోలీస్ స్టేషన్‌లో మహిళను విచారిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు/మైలవరం/కొండాపురం : ఏం కష్టం వచ్చిందో ఏమో... ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని వచ్చింది. సిబ్బంది గమనించి ఆమెను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికుల వివరాల మేరకు... మైలవరం మండలం దొమ్మర నంద్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్యయత్నం చేయబోయింది. రాత్రి ఎనిమిది గంటల సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడం గమనించిన లష్కర్లు మైలవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు స్పందించి జలాశయంలోని 13వ గేట్ వద్ద ఉన్న మహిళను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. తనది దొమ్మరనంద్యాల గ్రామంకాగా.. తన పేరు అంజనమ్మగా చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి. కుటుంబ సమస్యలతో బిడ్డలతో సహా ఆత్మహత్యకు పాల్పడాల్సి వచ్చిందని ఆమె తెలుపడంతో పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి క్షేమంగా ఇంటికి పంపారు.

ప్రజల హక్కుల కోసం పోరాటం సాగిస్తాం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం పోరాటం సాగిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ దేశానికి ఒరగబెట్టిందేమీ లేదని, ప్రతిపక్ష, ప్రాంతీయ పార్టీల హక్కులను కాలరాసిందన్నారు. సీబీఐ, ఈడీ ఇతర స్వతంత్ర సంస్థలను తన చేతుల్లో పెట్టుకుని సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రాష్ట్ర హక్కులను బీజేపీ నేతలకు తాకట్టు పెట్టారన్నారు. ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేసి పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఓబులేసు మాట్లాడుతూ ఎన్డీఏ ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్న టీడీపీ ప్రాధాన్యం కలిగిన మంత్రి పదవి పొందలేక పోయిందన్నారు. అమరావతి, పోలవరం మాత్రమే కాకుండా రాయలసీమ ప్రాంతంలోని నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ఇంకా జగన్ అరాచకాలు... గత ప్రభుత్వ తప్పులంటూ ప్రచారం చేయటం తగదన్నారు. రాష్ట్రంలో హత్యా రాజకీయాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, అనుకూల మీడియా గతంలో జరిగిన హత్యల గురించి ప్రస్తావించడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఎల్ నాగసుబ్బారెడ్డి, ఎంవి. సుబ్బారెడ్డి, ఎస్.వెంకటశివ, పి.చంద్రశేఖర్, వి.వీరశేఖర్, జి.వేణుగోపాల్, ఎస్.విజయలక్ష్మి , సి.సుబ్రహ్మణ్యం, కేసీ.బాదుల్లా, వి.గంగాసురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలు వరం

- రెండో రోజునా కొనసాగిన అడ్మిషన్ల ప్రక్రియ
- మొత్తం 1051 మందికి గాను 861 మంది హాజరు

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలు వరంగా మారాయని ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.విజయ కుమార్, అడ్మిషన్ల కన్వీనర్ ప్రొ.అమరేంద్రకుమార్ సంద్ర పేర్కొన్నారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలోని సెంట్రల్ లైబ్రరీలో రెండో రోజు మంగళవారం అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగింది. 525 మంది విద్యార్థులను అడ్మిషన్ల కోసం పిలువగా 432 మంది హాజరై అడ్మిషన్లు పొందారు. వివిధ రకాల ఫైల్స్ సబ్మిట్ తర్వాత దరఖాస్తులను విద్యార్థులు పూర్తి చేశారు. అలాగే అడ్మిషన్ల ప్రక్రియపై ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.విజయకుమార్‌తోపాటు కన్వీనర్ అమరేంద్ర పర్యవేక్షించారు. అడ్మిషన్ల కోసం విచ్చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లుచేసిన ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారి రవి కుమార్, టీమ్ మొత్తాన్ని వారు అభినందించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఆర్కేవ్యాలీ క్యాంపస్ అడ్మిషన్ కన్వీనర్ రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 1041 మంది విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపగా 861 మంది విద్యార్థులు హాజరై అడ్మిషన్లు పొందారని, ఇంకా 180 ఖాళీలున్నాయని డైరెక్టర్ వెల్లడించారు. మిగిలిన వాటిని భర్తీ చేసేందుకు ఆగష్టు మొదటి వారంలో రెండో జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రోజర్‌బిన్ని, ఇమ్రాన్ షరీఫ్, అనిల్‌కుమార్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కోటేశ్వరి, దీప్తి, చంద్రారెడ్డి, రాఘవరెడ్డి తెలిపారు.

ఇంటర్ విద్యార్థి మృతి


మృతి చెందిన మనోజ్

కలికిరి : రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొని జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మనోజ్(17) గాయాలతో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాళెం కస్పాకు చెందిన భాస్కర్, రేణుకారాణి దంపతులకు మనోజ్(17), మొనీష్ ఇద్దరు కుమారులు. సోమవారం సాయంత్రం మనోజ్ సొంత పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. గ్రామ సమీపంలో నివాసముంటున్న వెంకటరమణ తన ద్విచక్ర వాహనంతో ఎదురుగా వచ్చి ఢీకొన్నారు. ప్రమాదంలో మనోజ్‌కు తీవ్రగాయాలయవగా మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి ఆస్పత్రికి తరలించారు. మనోజ్ అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం విద్యార్థి మృతి చెందాడు. మృతుడి తల్లి రేణుకరాణి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

రిమ్స్‌లో దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన

జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి


వికలాంగుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్న డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, వైద్యులు

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా 3436 మందికి సంబంధించిన వికలాంగ సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 3436 మందికి నోటీసులను ఇచ్చామని, వారు నేరుగా ఆయా తేదీలలో వచ్చి సర్టిఫికెట్లను పునఃపరిశీలించుకోవాలని సూచించారు. ప్రస్తుతం కడప రిమ్స్‌లో మంగళ, శుక్ర వారాల్లో దివ్యాంగులకు 'సదరం' సర్టిఫికెట్లను పకడ్బందీగా మంజూరు చేస్తున్నామన్నారు. నోటీసులు అందుకుని వెరిఫికేషన్‌కు వచ్చిన వారిలో చాలామందికి వికలత్వం లేదని తెలిపారు. కడప రిమ్స్, ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ఇతర ఆసుపత్రులలో గతంలో ఇచ్చిన సర్టిఫికెట్స్‌పై ఇప్పటివరకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. నోటీసులు పొందిన ఇతర జిల్లాల వారు ఖచ్చితంగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ వైద్యులు, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదకు దాతల చేయూత

కడప రూరల్ : కడప నగరం ప్రకాష్ నగర్‌లో నివసిస్తున్న నిరుపేద వెంకటరమణ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన చికిత్స కోసం దాతలు సహకరించాలని సాక్షి మంగళవారం 'నిరుపేద.. ఆపై పెద్ద బాధ' కథనం ప్రచురించింది. దీంతో పలువురు దాతలు స్పందిస్తున్నారు. ప్రధానంగా హౌసింగ్ బోర్డ్ కాలనీ కోదండరామాలయం ఆలయ ధర్మకర్త బి.వెంకటరెడ్డి రూ.15వేలు అందజేశారు. ఆలయ సేవకులు తమ వంతు సాయం చేసి దాతృత్వం చాటుకుఉన్నారు. అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు విజయ్ బట్టర్ రూ.10 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ భార్య సరిత 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. తన భర్తకు సర్జరీ చేయించడానికి బుధవారం హైదరాబాద్‌కు వెళ్తున్నామని తెలిపారు.

అగ్నిప్రమాదంపై కొనసాగిన దర్యాప్తు

– కార్యాలయాన్ని పరిశీలించిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా


సబ్ కలెక్టరేట్‌లో కాలిపోయిన రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై రెండో రోజు మంగళవారం దర్యాప్తు కొనసాగింది. డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆధ్వర్యంలో పది ప్రత్యేక బృందాలు పూర్తిస్థాయి విచారణ చేపట్టాయి. సోమవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ ప్రమాద ఘటన పరిశీలించి షార్ట్ సర్క్యూట్ కాదని, ఉద్దేశ పూర్వకంగా జరిగిన ఘటనేనని భావిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, ఆదివారం విధులు నిర్వర్తించడం పరిశీలిస్తే కుట్ర పూరితంగానే ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు వారు వెల్లడించారు. పూర్తిస్థాయిలో విచారిస్తామని, దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని, అవసరమైతే సీఐడీకి కేసు అప్పగిస్తామని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సబ్ కలెక్టరేట్‌ను పోలీసుల ఆధీనంలోకి తీసుకుని రెవెన్యూ, విచారణ అధికారులు మినహా ఎవ్వరినీ లోపలికి రాకుండా కట్టుదిట్టం చేశారు. ఉదయం నుంచే కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు రెవెన్యూ అధికారులను విచారించడం మొదలుపెట్టారు. ట్రాన్స్‌కో, విజిలెన్స్, క్లూస్‌టీమ్, ఫైర్ డిపార్ట్‌మెంట్ సభ్యులు దర్యాప్తు ముమ్మురం చేశారు. సాయంత్రం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ(రెవెన్యూ) సిసోడియా మదనపల్లెకు చేరుకుని సబ్ కలెక్టరేట్‌లో ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కారణాలను త్వరితగతిన గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆదివారం కార్యాలయంలో ఎవరెవరున్నారు? షార్ట్‌సర్క్యూట్ ఎలా జరిగింది? ఇన్వర్టర్లు ఎక్కడెక్కడ ఉన్నాయి? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గదిలో కాలిపోయిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్.వెంకటేశ్వర్, ట్రాన్స్‌కో జేఎండీ చక్రధరబాబు, ఆర్డీఓ హరిప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య హత్యకేసులో భర్తకు జీవితఖైదు


భర్త ఆనంద్

సుండుపల్లె : భార్యను హత్య చేసిన కేసులో అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండలం పెద్దబలిజపల్లి గ్రామానికి చెందిన నంద్యాల ఆనంద్‌కు జీవిత ఖైదు విధిస్తూ జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారని సీఐ తులసీరాం, ఎస్సై ఎస్‌కెఎం.హుస్సేన్ తెలిపారు. ఆనంద్, ఆయన భార్య ధనలక్ష్మి గతంలో బ్రతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లారు. అక్కడ మరొకరితో ధనలక్ష్మి వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఆనంద్ పలుమార్లు ఆమెను హెచ్చరించారు. అయినా వినలేదని 2004లో తన భార్య ధనలక్ష్మిని పెద్దబలిజపల్లికి తీసుకువచ్చాడు. సమీపంలోని ఊటువంక వద్దకు రాత్రి తీసుకువచ్చి అక్కడ కట్టెతో బలంగా తలపై కొట్టి చంపేశాడు. అనంతరం అక్కడే ఇసుకలో పూడ్చి ఎవరికీ తెలియకుండా కువైట్‌కు వెళ్లిపోయాడు. ధనలక్ష్మీ తల్లి పోకల చిన్నక్క ఫిర్యాదు మేరకు సుండుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి విచారించారు. 2007లో ఆనంద్ సుండుపల్లికి రావడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ ఎం.ఖాసింసాహెబ్, ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. జడ్జి నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

పోక్సో కేసులో తీర్పు

కడప అర్బన్ : మైనర్ బాలికపై అత్యాచారం చేసి.. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించిన కేసులో బాలుడికి రూ.3 వేల జరిమానా, రెండేళ్లపాటు అబ్జర్వేషన్ హోంకు పంపుతూ జడ్జి నందిని మంగళవారం తీర్పు చెప్పారు. చక్రాయపేట గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై 2021 ఆగష్టు, 12న 15 ఏళ్ల బాలుడు అత్యాచారం చేసి.. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించారు. ఈ విషయంపై బాధితురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి ఎస్ఐ కె.రఘురాం కేసు నమోదు చేశారు. పులివెందుల డీఎస్పీ ఇ. శ్రీనివాసులు విచారించి కడప జువైనల్ జస్టిస్ బోర్డ్ చైర్‌పర్సన్ ఎదుట బాలుడిని హాజరుపరచగా.. జడ్జి నందిని రూ.3000 జరిమానాతో పాపాటు, జువైనల్‌ను సంస్కరించడానికి రెండున్నరేళ్ల పాటు అబ్జర్వేషన్ హోంకు పంపాలని తీర్పు ఇచ్చారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యాముసుందర్‌రెడ్డి వాదించారు.